## క్లుప్తంగా

### రాష్ట్రస్థాయి అవార్డుకు పెంచికలపేట జీపీ ఎంపిక

**ఆత్మకూరు :** మండలంలోని పెంచికలపేట గ్రామ పంచాయతీ మహిళ స్నేహ పూర్వక విభాగంలో రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికైంది. గ్రామ పంచాయతీ ద్వారా మహిళల భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం తోపాటు గ్రామంలో అనేక మంది మహిళలు ముద్ర రుణాలు తీసుకొని వ్యాపారం చేసుకుంటూ ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఈనెల 31న హైదరాబాద్ సర్పంచ్ కోరె లలితకు అవార్డు అందజేస్తారని ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీఓ చేతన్‌రెడ్డి తెలిపారు.

### సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి

**దామెర :** శ్రీరామనవమిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని శ్రీ హనుమాన్ ఆలయంలో, ఇతర గ్రామాల్లోని ఆలయాల్లో నేడు (గురువారం) సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా దామెరలోని శ్రీ హనుమాన్ ఆలయ కమిటీ చైర్మన్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పోలం కృపాకర్‌రెడ్డి మాట్లాడారు. ఉదయం 11.30 గంటలకు శ్రీ సీతారాముల కల్యాణం, అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని వీక్షించి తరలించాలని ఆకాంక్షించారు. ఊరుగొండలో సర్పంచ్ గోగుల సత్యనారాయణరెడ్డి, ఓగ్లాపూర్‌లో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ కేతిపల్లి శ్రీధర్‌రెడ్డి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

### ఎమ్మెల్యే పరామర్శ

**ఎల్కతుర్తి :** భీమదేవరపల్లి మండలంలోని గాంధీనగర్ గ్రామానికి చెందిన తాళ్లపెల్లి మరియమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని హుస్నాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్, హనుమకొండ జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్ బుధవారం పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వంగ రవి, ఎంపీపీ జక్కుల అనిత తదితరులు పాల్గొన్నారు.

### అనాథ బాలలకు సాయం



**ధర్మసాగర్ :** మండల కేంద్రానికి చెందిన ఏనుట్ల వెంకటమల్లు ఇటీవల, రెండేళ్ల క్రితం అతని భార్య మృతి చెందడంతో అనాథలుగా మారిన వారి ఇద్దరు పిల్లలకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుర్రపు ప్రసాద్ బుధవారం రూ.10 వేలు సాయం అందించారు. తొలుత చిన్నారులను ప్రసాద్ పరామర్శించారు. అలాగే సర్పంచ్ ఎర్రబెల్లి శరత్ కడియం యువసేన సభ్యుల ద్వారా చిన్నారులకు రూ.5 వేలు సాయం చేశారు. దాతలకు గోసంగి కుల సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. చిన్నారులిద్దరికీ ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు అండగా నిలవాలని ఆకాంక్షించారు.

### నిందితులను శిక్షించాలి

**దామెర :** ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెట్టుపల్లి శివాజీపై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు హింగె బాబురావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లో శివాజీపై మూకుమ్మడిగా బ్యాట్లు, రాడ్‌లతో విచక్షణారహితంగా దాడి చేయడం దారుణమన్నారు. శివాజీ కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాడని తెలిపారు. శివాజీ ఎదుగుదలను ఓర్వలేకే దాడి చేశారని మండిపడ్డారు. నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఉపసర్పంచ్ హింగె నాగేశ్వర్‌రావు, సంఘం నాయకులు హింగె రాజేశ్వర్‌రావు, దుర్గునాల యోగేశ్వర్‌రావు, రత్నాకర్‌రావు, హింగె రవీందర్, మోటె శంకర్‌రావు, హింగె కిషన్, హింగె సురేందర్‌రావు పాల్గొన్నారు.

### విద్యుత్ మోటార్ చోరీ

**ఐనవోలు :** మండలంలోని వనమాల కనపర్తి గ్రామానికి చెందిన కొట్టె సునీల్‌కు చెందిన వ్యవసాయ బావి వద్ద ఉన్న విద్యుత్ మోటార్ చోరీకి గురైంది. ఈ మేరకు సునీల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్ మోటార్‌ను దొంగిలించారని పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గుగులోతు వెంకన్న తెలిపారు.

### పేకాటరాయుళ్ల అరెస్టు

**ఐనవోలు :** పేకాడుతున్న 9 మందిని ఐనవోలు పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని వనమాల కనపర్తి గ్రామంలో పేకాడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు గ్రామ శివారులోని అన్నపురం వీరస్వామి బావి వద్ద పేకాట శిబిరంపై దాడి చేశారు. ఈ సందర్భంగా 9 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.39,740లు నగదుతోపాటు 8 సెల్ ఫోన్లు, 3 మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైన వారిలో సింగారపు రమేష్, సింగారపు చంద్రమౌళి, అన్నపురం అశోక్, మోరె రాజు, పుట్నాల బాలరాజు, నాగవెల్లి నవీన్, ఓదెల రాజు, కందుకూరి ప్రసాద్, కె.రవి ఉన్నారని ఎస్సై తెలిపారు.

# అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

● ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్

**ఎల్కతుర్తి :** గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ స్పష్టం చేశారు. భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండలోని బీఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. స్వరాష్ట్రం ఏర్పడక ముందటి పరిస్థితులు ప్రజలకు తెలుసన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చి సీఎంగా కేసీఆర్ బాధ్యతలు తీసుకున్నాక రాష్ట్రం అభివృద్ధి పథాన దూసుకుపోతోందని తెలిపారు. తొమ్మిదేళ్లలో అనేక పురోగతి సాధించినట్లు చెప్పారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకలు ప్రతిఇంటికీ అందుతున్నాయని తెలిపారు. సంక్షేమ పథకాలు అమలు చేస్తూ జీవితాల్లో వెలుగులు నింపుతున్నట్లు చెప్పారు. అన్ని వర్గాల ప్రజల బతుకులు బాగుపడుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధికి ప్రతీకగా నిలిపామన్నారు. త్వరలో గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి నీళ్లు నింపుతామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. పార్టీ ఎదుగుదలను ఓర్వలేక ప్రతిపక్షాలు బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలకు వివరించి చైతన్యవంతులను చేయాలని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కార్యకర్తల సంక్షేమానికి పార్టీ కట్టుబడి ఉందన్నారు. సమావేశంలో జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్, ఎమ్మెల్సీ బస్వారాజు సారయ్య, జెడ్పీటీసీ వంగ రవి, ఎంపీపీ జక్కుల అనిత పాల్గొన్నారు.

# పేదలకు పెద్దకొడుకులా కేసీఆర్...



చెక్కు అందిస్తున్న చైర్‌పర్సన్ జ్యోతి



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న జ్యోతి

**శాయంపేట :** సీఎం కేసీఆర్ పేద కుటుంబాలకు పెద్దకొడుకులా అండగా ఉంటున్నారని వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి తెలిపారు. మండలంలోని శాయంపేట, పత్తిపాక, తహరాపూర్, పెద్ద కోడెపాక, కొత్తగట్టు సింగారం గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు బుధవారం ఆమె కల్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ అనేక పథకాలు అమలు చేస్తున్నారని మండలంలోని సాదోనిపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ ఆవుల సాంబయ్యను జెడ్పీ చైర్‌పర్సన్ జ్యోతి పరామర్శించారు. త్వరగా కలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ రామిశెట్టి లత లక్ష్మారెడ్డి, పరకాల ఏఎంసీ వైస్ చైర్మన్ మారేపల్లి నందం, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి, సర్పంచ్‌లు చిట్టిరెడ్డి రాజిరెడ్డి, అబ్బు ప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణాల పరిశీలన**

మండలంలోని గంగిరేణిగూడెం గ్రామంలో చేపట్టిన డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలను జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి సందర్శించి పరిశీలించారు. పనుల పురోగతిపై సర్పంచ్ శానం మంజుల పరమేష్, వైస్ ఎంపీపీ రామిశెట్టి లత లక్ష్మారెడ్డిలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

# పరిసరాల శుభ్రతలో నిర్లక్ష్యం చేయొద్దు

● డీఆర్డీఓ శ్రీనివాస్ కుమార్



నర్సరీ పనులను పరిశీలిస్తున్న శ్రీనివాస్

**నడికూడ :** పల్లెల్లో పరిసరాల శుభ్రత నిర్వహించడంలో నిర్లక్ష్యం చేయొద్దని డీఆర్డీఓ శ్రీనివాస్ కుమార్ అధికారులను కోరారు. మండలంలోని నడికూడ, కంఠాత్మకూర్, ముస్త్యాలపల్లి గ్రామాల్లోని నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. నర్సరీల్లో పండ్ల మొక్కలపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో పరిసరాలు శుభ్రంగా ఉంచడంలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణం, నర్సరీల నిర్వహణ, మన ఊరు–మన బడి పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నడికూడ ప్రకృతి వనంపై డాక్యుమెంటరీ చేయాలని, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రకృతి వనాల్లో ఒకటిగా నిలుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, ఎంపీఓ అఫ్జల్, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# టెన్త్ విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు



ధర్మసాగర్ : విద్యార్థులతో ఉపాధ్యాయులు



కమలాపూర్‌లో..



ఆత్మకూరులో..

**ధర్మసాగర్ (వేలేరు) :** మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు బుధవారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హెచ్‌ఎం పి.నాగకుమారి అధ్యక్షత వహించి మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థుల సందడి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

**కమలాపూర్ :** మండలంలోని కన్నూరు జెడ్పీ హైస్కూల్‌లో టెన్త్ విద్యార్థుల బుధవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో హెచ్‌ఎం బి.లక్ష్మారెడ్డి మాట్లాడారు. మండలంలో ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో సందడి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి.రాంబాబు, సమ్మయ్య, తిరుపతిరెడ్డి, విమల, పి.శోభ, ఆర్.వెంకటస్వామి, బి.వేణు పాల్గొన్నారు.

**ఆత్మకూరు :** మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు పుల్లా నిర్మలకుమారి మాట్లాడారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఒత్తిడికి లోను కావద్దని, ఎలాంటి సందేహాలున్నా ఉపాధ్యాయులతో నివృత్తి చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ రవీందర్, ఉపాధ్యాయులు పద్మ, మార్త సురేందర్, వెంకట్రాంరెడ్డి, శేషగిరిరావు, తదితరులు పాల్గొన్నారు.

### ఆలయ భూమిని కాపాడాలని ధర్నా



**ఎల్కతుర్తి :** రాజరాజేశ్వర స్వామి ఆలయ భూమిని కాపాడాలని కోరుతూ భీమదేవరపల్లి మండలంలోని వంగర గ్రామస్తులు హనుమకొండ–సిద్ధిపేట ప్రధాన రహదారిపై బుధవారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడారు. ఆలయం భూమి ఆక్రమణకు గురైందని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నల్లగొని రాజు, వార్డు సభ్యులు అశోక్, శ్రీదేవి, కళ్యాణీ, పద్మ, కొండాల్‌రెడ్డి, శ్రీనివాస్, రమేష్, వెంకటస్వామి, చంద్రారెడ్డి, అయిలయ్య, ప్రదీప్‌రెడ్డి, కుమార్, కనుకయ్య, రవి, భాస్కర్, తిరుపతి పాల్గొన్నారు.

### బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చంద్రమౌళి



**పరకాల :** పరకాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పి.చంద్రమౌళి ఎన్నికయ్యారు. పట్టణంలోని అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని న్యాయవాదులు ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా గండ్ర నరేష్‌రెడ్డి, జి.రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా మేకల శ్రావన్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా లక్కం శంకర్, కోశాధికారిగా రాఘవేంద్ర శర్మ, ప్రచార కార్యదర్శిగా సాబీర్, మీడియా కార్యదర్శిగా అకినపల్లి రవికుమార్‌తోపాటు సభ్యులను ఎన్నుకున్నారు.

# చిరుధాన్యాల్లో సమృద్ధిగా పోషక విలువలు



ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

**దామెర :** చిరుధాన్యాల్లో పోషక విలువలు సమృద్ధిగా ఉంటాయని జెడ్పీటీసీ గరిగె కల్పన కృష్ణమూర్తి తెలిపారు. మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. చిరుధాన్యాల వల్ల కలిగే ప్రయోజనాలపై సమాజంలోని ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సమతుల ఆహారం తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ శంకర్, వైస్ ఎంపీపీ జాకిర్‌అలీ, తహసీల్దార్ రియాజుద్దీన్, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, ఎంపీఓ యాదగిరి, సర్పంచ్ గురిజాల శ్రీరాంరెడ్డి, మెడికల్ ఆఫీసర్ ఉషారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జంగం రాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి తదితరులు మాట్లాడారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అవగాహనతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట



మాట్లాడుతున్న ఎస్సై డి.హరిత

**ధర్మసాగర్ (వేలేరు) :** అవగాహన పెంచుకోవడం ద్వారానే సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయొచ్చని ఎస్సై డి.హరిత స్పష్టం చేశారు. మండలంలోని ఎర్రబెల్లి గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం మాధవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో ఎస్సై మాట్లాడారు. ఆగంతకులు కంప్యూటర్ టెక్నాలజీని సైబర్ నేరాలకు పాల్పడతారని చెప్పారు. అపరిచితులకు సెల్ ఫోన్‌కు వచ్చే ఓటీపీ, ఇతర సందేశాలు ఇవ్వొద్దని తెలిపారు. సైబర్ నేరాల బారిన పడితే 24 గంటల్లోగా 1930కి డయల్ చేస్తే నష్టాన్ని నివారించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గూడ కవిత, ఉపసర్పంచ్ అల్లం సతీష్, వార్డు సభ్యులు చిలుక భాస్కర్, ఎస్‌ఎంసీ చైర్మన్ రమాదేవి, సీఆర్పీ మొగిలిచర్ల శ్రీనివాస్, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలి



**శాయంపేట :** అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులను ముమ్మరం చేసి స్వచ్ఛగ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎస్‌బీఎం ప్రతినిధి సంపత్‌కుమార్ కోరారు. స్వచ్ఛ భారత్ మిషన్, గ్రామీణ డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది, వీఓఏలు, సర్పంచ్‌లకు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం చేపట్టిన చేపట్టిన మూడ్రోజుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తి, ఎంపీఓ రంజిత్ కుమార్, సర్పంచ్ గుండెకారి రజిత శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సంధ్య, ఎస్‌బీఎం ప్రతినిధులు ప్రవీణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

**శాయంపేట :** మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర, బాలికల, నవోదయ ఉన్నత పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు ఆయాన్ ఫౌండేషన్ చైర్మన్ మహమ్మద్ మున్నా బుధవారం పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. అలాగే గట్లకనిపర్తి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రికార్డు అసిస్టెంట్ రాజ్ మహమ్మద్ పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వరల్డ్ హ్యూమన్ రైట్స్ జిల్లా వర్కింగ్ చైర్మన్ కృష్ణమూర్తి, పాఠశాలల హెచ్‌ఎంలు సీతామహాలక్ష్మీ, వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు కరుణాకర్‌రెడ్డి, భాస్కర్, రాంచంద్రరావు, శారద, వసంతలత పాల్గొన్నారు.

### సిబ్బందిని క్రమబద్ధీకరించాలని మంత్రికి వినతి

**దామెర :** ఉపాధి హామీ పథకం సిబ్బందిని క్రమబద్ధీకరించాలని కోరుతూ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావుకు ఎంపీపీ శంకర్ బుధవారం వినతిపత్రం రాశారు. అనంతరం ఆ పత్రాన్ని ఈజీఎస్ సిబ్బందికి ఎంపీపీ అందజేశారు. ఈ సందర్భంగా ఈజీఎస్ సిబ్బంది మాట్లాడారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించి క్రమబద్ధీకరించాలని, ఐకేపీ ఉద్యోగులకు వర్తింపజేసిన తరహాలోనే తమకూ పే స్కేలు వర్తింపజేస్తూ జీఓ జారీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వినతిపత్రం స్వీకరించిన వారిలో ఏపీఓ శారద, టీఏలు సురేందర్, ప్రిసిల్లా, ఆపరేటర్ సుమ పాల్గొన్నారు.

### గోడ కూల్చి దారి వెడల్పు



**పరకాల :** పట్టణంలో పండ్ల వ్యాపారస్తుల దురాక్రమణలో ఉన్న స్థలాన్ని పోలీసు బందోబస్తు నడుమ ఆర్టీసీ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకుని అడ్డుగా ఉన్న గోడను కూల్చి దారి వెడల్పు చేయించారు. కాగా ఆ దారిని కొన్నేళ్లుగా పండ్ల వ్యాపారస్తులు ఆక్రమించుకొని వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఆర్టీసీ అధికారులు పలుమార్లు హెచ్చరించిన పట్టించుకోకపోవడంతో పోలీసుల సాయంతో గోడను కూల్చి దారిని వెడల్పు చేశారు.

### నూతన పాస్‌బుక్‌లు ఇవ్వాలి

**ఐనవోలు :** తమకు నూతన పాస్‌బుక్‌లు ఇవ్వాలని కోరుతూ మండలంలోని పంథిని గ్రామానికి చెందిన పలువురు రైతులు తహసీల్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ (డీటీ) రమేష్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు ఐ.భిక్షపతి, జె.రమేష్, యాకయ్య, బి.రాములు, ఎస్.చేరాలు మాట్లాడారు. గ్రామంలోని సర్వే నంబర్ 587, 591, 593ల్లోని ఉపనంబర్లలోని భూమిని గ్రామానికి చెందిన గద్దల బాబు, యశోద అక్రమంగా నూతన పట్టా పాస్‌బుక్ పొందారని చెప్పారు. అనేక ఏండ్లుగా సదరు భూమిలో తాము కబ్జాలో ఉన్నామన్నారు.

### పత్తిపాకలో విషాదఛాయలు

**శాయంపేట :** పరకాల చలివాగు వద్ద వ్యవసాయ కూలీలతో ప్రయాణిస్తున్న ఆటోను కారు ఢీకొన్న ఘటనలో కొంగరి చేరాలు, దుబాసి కోమల మృతి చెందడంతో మండలంలోని పత్తిపాకలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాదంలో ఏడుగురికి గాయాలవగా ఇద్దరు మృతి చెందిన విషయం దావానలంలా వ్యాపించింది. ఏప్రిల్ 4, 2022న అదే గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీల వాహనం మండలంలోని తహరాపూర్‌లోని కేజీబీవీ వద్ద ప్రమాదానికి గురై నలుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. ఆ ఘటన చోటు చేసుకుని ఏడాది గడవకముందే తాజాగా ఇద్దరు మృతి చెందడంతో విషాదం నెలకొంది. మృతుల కుటుంబాలను, క్షతగ్రాతులను ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు కోరారు.

### 2న కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహావిష్కరణ

**పరకాల :** పట్టణంలోని ఆర్టీసీ డిపో క్రాస్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం ఏప్రిల్ 2న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరిస్తామని పోపా అధ్యక్షుడు పోతాని రాజేశ్వర్‌రావు తెలిపారు. కార్యక్రమానికి రావాలని కోరుతూ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి హనుమకొండలోని నివాసంలో ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో పోపా సభ్యులు బాసాని దయాకర్, రాచర్ల అశోక్, దుంపేటి నాగరాజు, కోమాకుల రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

### డ్రైవింగ్ శిక్షణ ప్రారంభం

**శాయంపేట :** మండల కేంద్రంలోని బీసీ కాలనీలోని గ్రౌండ్‌లో బీఆర్‌ఎస్ రాష్ట్ర యువజన నేత గండ్ర గౌతంరెడ్డి ఏర్పాటు చేసిన జీఎంఆర్‌ఎం ట్రస్ట్ ద్వారా విన్ మోటార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్రైవింగ్ ఉచిత శిక్షణను ఉపసర్పంచ్ దైనంపల్లి సుమన్ ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు గాజె రాజేందర్, నాయకులు బత్తుల కార్తీక్, మారెపెల్లి మోహన్ పాల్గొన్నారు.

### పేదల కోసమే 'ఆయుష్మాన్ భారత్'

**ఎల్కతుర్తి :** కేంద్ర ప్రభుత్వం పేదల కోసమే 'ఆయుష్మాన్ భారత్' పథకాన్ని ప్రవేశపెట్టిందని బీజేపీ మండల అధ్యక్షుడు పైడిపెల్లి పృథ్వీరాజ్ తెలిపారు. భీమదేవరపల్లి మండలంలోని గట్లనర్సింగాపూర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామంలోని పేదల వివరాలు నమోదు చేసి కార్డు ఇప్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ములుగు సంపత్, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

### భూవివాదంపై డీసీపీ విచారణ



**దామెర :** మండలంలోని ముస్త్యాలపల్లి గ్రామంలో నెలకొన్న భూవివాదంపై సెంట్రల్ జోన్ డీసీపీ బారీ బుధవారం విచారణ చేశారు. గ్రామానికి చెందిన చిలువేరు భిక్షపతి తన భూమిని సతీష్‌కుమార్ ఆక్రమించాడని ఆరోపిస్తూ తనకు న్యాయం చేయాలని కోరుతూ ఇటీవల గ్రీవెన్స్‌లో నగర పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. కాగా ఈ విషయమై సీపీ ఆదేశాల మేరకు డీసీపీ విచారణ చేశారు. క్షేత్రస్థాయిలో భూమిని సందర్శించి హద్దులు పరిశీలించారు. ఇరుపక్షాల వాదనలు విని, భూమికి సంబంధించిన పత్రాలు పరిశీలించారు. అనంతరం డీసీపీ మాట్లాడారు. సీపీకి నివేదిక అందజేస్తామన్నారు. డీసీపీ వెంట ఎస్సై ముత్యం రాజేందర్, సర్పంచ్ వడ్డెపల్లి శ్రీనివాస్, ఆర్‌ఐ భాస్కర్‌రెడ్డి తదితరులున్నారు.

# అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లండి



మాట్లాడుతున్న పోలెపల్లి శంకర్‌రెడ్డి

**ఐనవోలు :** గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పోలెపల్లి శంకర్‌రెడ్డి శ్రేణులకు సూచించారు. నర్సింహులగూడెం, ముల్కలగూడెం గ్రామాల్లో ఆయా గ్రామాల ఇన్‌చార్జ్‌లు, సమన్వయ కమిటీలు, అనుబంధ సంఘాలతో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను, నాయకుల వినతులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గ్రామాల్లో నాయకులు సమన్వయంతో పని చేయాలని చెప్పారు. అనుబంధ కమిటీలను వెంటనే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, వైస్ ఎంపీపీ తంపుల మోహన్, సొసైటీ వైస్ చైర్మన్‌లు చందర్‌రావు, మాదాసు బాబు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ మునిగాల సమ్మయ్య, మండల ప్రధాన కార్యదర్శి బుర్ర రాజశేఖర్, అధికార ప్రతినిధి మిద్దెపాక రవీందర్, వడిచర్ల శ్రీనివాస్, మధుకర్, భాస్కర్, సురేష్, కొమురయ్య, అబ్బాస్‌అలీ, రాఘవులు, సతీష్, దేవికరెడ్డి, అరుణ్‌కుమార్, కోమలత, సర్పంచ్ సునీత, ఎంపీటీసీ సరిత, ఉపసర్పంచ్ భాస్కర్‌రెడ్డి, గుంశావలీ, బాబు, రాజు, సతీష్, యాకయ్య, సదానందం, లక్ష్మన్, రామకృష్ణ, సంతాజీ పాల్గొన్నారు.

# టీడీపీ ఆవిర్భావ వేడుకలు

**ఎల్కతుర్తి :** మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో టీడీపీ జెండాను రాష్ట్ర నాయకుడు సారుపాక రాజు ఆవిష్కరించి మాట్లాడారు. పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కోఆర్డినేటర్ మహ్మద్ నసూర్, నాయకుడు తోకల శ్రీనివాస్ పాల్గొన్నారు.

**కమలాపూర్ :** మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద టీడీపీ జెండాను ఆ పార్టీ మండల అధ్యక్షుడు పెరుమాండ్ల పరశురాములు ఆవిష్కరించి మాట్లాడారు. 'ఎన్టీఆర్ అమర్ రహే, చంద్రబాబు నాయుడి నాయకత్వం వర్ధిల్లాలి' అని నినాదాలు చేశారు. కార్యక్రమంలో పెండ్యాల తిరుపతిరెడ్డి, అల్లాటి ధర్మరాజు, యాంసాని రాజు, మేడిపెల్లి వీరన్న, కుమారస్వామి, ఎన్టీఆర్ పాల్గొన్నారు.

# ప్రజాఉద్యమాలపై అణచివేత



విద్యార్థి నాయకులతో మాట్లాడుతున్న పద్మ

**ధర్మసాగర్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రజాఉద్యమాలపై అణచివేత ధోరణి అవలంభిస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ విమర్శించారు. హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థి సంఘాల నాయకులను బుధవారం పోలీసులు అరెస్ట్ చేయగా వారిలో కొందరిని మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా అరెస్టైన విద్యార్థి నాయకులను రావు పద్మ పరామర్శించి మాట్లాడారు. ప్రశ్నించిన ప్రతి ఒక్కరినీ పోలీసులతో అడ్డుకుంటున్నారని తెలిపారు. కేయూ వీసీ అధికార పార్టీకి తొత్తుగా మారి సభకు అనుమతి ఇచ్చి రద్దు చేయడం సిగ్గుచేటన్నారు. ఆమె వెంట బీజేపీ నాయకులు దేశిని సదానందం గౌడ్, మండల అధ్యక్షుడు గంకిడి శ్రీనివాస్‌రెడ్డి, చిలుక విజయరావు, బొజ్జపెల్లి సుభాష్, తోపుచర్ల మధుసూదన్, గాజుల సంపత్, చట్ల రాజు, పూల శ్రీనివాస్, శ్రీరాముల విజయ్‌కుమార్ తదితరులున్నారు.